


"అస్సలాము-అలైకుమ్''

"వాలెకుమ్ సలామ్'' బియ్యం చెరుగుతున్న చేట తటాలును క్రింద పెట్టి పైట చెరుగు తలమీద కప్పుకుందామె. ఆదరాబాదరా లేచి అడ్డుగోడలను అడ్డం చేసుకుని నిల బడింది. ఇంతకు ముందు విన్న గొంతే అనిపించింది. అయితే చూసిం తర్వాత కాని అర్థం కాలేదు. షేరూ భయ్యా అని. సుమారు అయిదేళ్ళ క్రితం ఓసారి చూసిందతణ్ణి. తన్ను తండ్రివద్దకు తీసుకుపోడానికి వచ్చినాడు. అప్పుడు అమ్మ చెప్పింది మీ అన్నయ్య షేర్ ఖాన్ అని. ఆ తర్వాత తిరిగి ఇప్పుడే చూసింది.

"బాగున్నావా షహనాజ్'' వేదనతో పలకరించాడతను. ఆమె తలదించుకుంది. ఉలుకు పలుకు లేదు.

"బావ ఇంకా ఇంటికి రాలేదా?'' కన్నీళ్లు నిండిన చూపుల్తో జాలిగా అతని వైపు చూసింది. అతను కూడా బాధగా ఆమె కళ్లలోకి చూచాడు. ఇద్దరి మధ్య అనురాగం తొణికిసలాడింది. తీయని అనుభూతి క్షణ కాలం ఆలోచనల్లో ముంచె త్తింది.

"అమ్మా నీ పెళ్లి విషయం నాన్నకు తెలియ జేయలేదు. అసలు మీరు ఈ వూరొచ్చిందే నాన్నకు తెలీదు. ఇటీవల ఒక స్నేహితుడి ద్వారా మీ విషయం తెలిసిందట. నేను కూడా ఆర్నెల్లుగా వ్యాపారపరంగా హైదరాబాద్ లోనే వుంటున్నాను. మొన్ననే ఇంటి కొచ్చాను. వివరాలు చెప్పి నీతో మాట్లాడి రమ్మన్నాడు నాన్న.''

గద్గద స్వరంతో "నాన్న బాగున్నాడా'' అంది.

"బీ.పి., షుగర్ ఎక్కువైనాయమ్మా! డాక్టరు ఇంట్లో నుండి ఎక్కడకు కదలకూడదన్నాడు.''

"వదినా, పిల్లలూ క్షేమంగా వున్నారు కదా!''

"అల్లా దయవల్ల అందరూ క్షేమమే!''

"బాధలో నుండి కొంచెం తేరుకుందామె. అక్కడున్న చిన్న తరహా పట్టె మంచం మీద జమకాణం పరిచింది. కూర్చో అన్నయ్యా ఇప్పుడే "చా'' తెస్తానని అడ్డగోడ చాటుకు పోయింది.

షేర్‌ఖాన్ నింపాదిగా ఒకసారి ఇల్లంతా కలయ చూశాడు. రెండంకణాల పెంకుల హవేలి. అంకణం మధ్య అడ్డుగోడ వుంది. భార్యా భర్తలిద్దరే వున్నట్లుంది అనుకున్నాడు. ఇంతలో ఆమె "చా'' తెచ్చి అందించింది. టీ కాదుగదా చెల్లెలి ప్రేమాభిమానాలు రుచి చూసినట్లుంది షేర్‌ఖాన్‌కు.

"అన్నయ్యా! నువ్విక్కడికి తప్పక వస్తావని అమ్మ చాలా సార్లు చెప్పింది. ఎటూ ఆమె ఇంటికి నువ్వు పోవుగదా. ఇక్కడికొచ్చినప్పుడైనా చూడాలని కుతూహలపడుతూంది. వచ్చినప్పుడు కబురు చెయ్యమని పదేపదే చెప్పింది. అమ్మగారిల్లు ఇక్కడికి దగ్గర్నే వుంది. ఉండు. పక్కింటి అమ్మాయిని పంపించి పది నిముషాల్లో పిలిపిస్తాను'' అంటూ సంతోషంగా బయటకి పోబోయింది షహనాజ్.

"షహనాజ్'' ఆవేశంగా అరిచాడు షేర్ ఖాన్. ఆ పిలుపు కాళ్లకు బంధం వేసినట్టు గతుక్కున ఆగిపోయిందామె. కంగారుగా అతనివైపు చూసింది. అతని ముఖం క్షణంలో ఎర్రబారింది. మెల్లగా లేచి సగం తాగిన చాయ్ కప్పును అడ్డగోడమీదుంచాడు. తల అడ్డంగా త్రిప్పుతూ "వద్దు...వద్దు షహనాజ్ వద్దు' అన్నాడు.

"అన్నయ్యా!'' అంటూ ఆశ్చర్యంగా అతన్ని సమీపించిందామె.

"నేనామెను చూడలేను. షహనాజ్ చూడలేను. నన్ను క్షమించు...వెళ్లొస్తాను'' ఎందుకో అతనక్కడ వుండలేకపోయాడు. రెండు చేతులు ముఖానికి అడ్డు పెట్టుకుని భోరున ఏడుస్తూ బిరబిరా వెళ్లిపోయాడు.

షహనాజ్ నివ్వెరపోయి అతను వెళ్లిన వైపు చూస్తూ వుండిపోయింది.

*    *    *    *    *

భర్త రెండుమూడు మార్లు పిలిస్తేగాని ఈ లోకంలోకి రాలేదు-షహనాజ్. అతన్ని చూస్తూనే పైటతో కన్నీళ్లు ఒత్తుకుంటూ లోపలికి వెళ్లిపోయింది. ఆమె పరిస్థితి అర్థం కాక ఆలోచిస్తూ తానూమెల్లగా ఇంట్లోకి ప్రవేశించాడు అబ్దుల్లా. పెండ్లయి నాలుగు నెలలు దాటింది. ఆమె మనస్తత్వం మింగుడుపడక తికమకపడుతున్నాడు. ఎప్పుడూ పరధ్యానంగా దేన్నో ఆలోచిస్తూ వుంటుంది. గట్టిగా మందలిస్తే ఆ రోజంతా వుపవాసం చేస్తుంది. కన్నీరు మున్నీరుగా యేడుస్తూ వంటా వార్పూ అనుకోకుండా కూర్చుంటుంది. తనకు రెండో పెళ్లి కాబట్టే అయిష్టంతో

# పాచికలు

సత్యాగ్ని

అట్లుండేమోనని చాలాసార్లు కలత చెందాడు. తొలి భార్య ముగ్గురి బిడ్డల్ని తనకప్పజెప్పి వెళ్లిపోయింది.

పట్టుమని 35 సంవత్సరాలు కూడా లేవు. తనకు రెండవ వివాహం చేసుకోక తప్పలేదు. అగ్రికల్చరల్ ఆఫీసులో అటెండర్ వుద్యోగం. రెండవ పెళ్ళయినా చాలా సంబంధాలు వచ్చాయి. పేదింటి పిల్లయితే పడుగుతుందని పైసా కట్నం లేకుండా 'నిఖా'' చేసుకున్నాడు. ఎర్రగా, సన్నగా పుత్తడి బొమ్మను మరపించేటట్లుంది షహనాజ్. తన సంసారంలో ఆనందం పండిపోతుందని ఎంతో ఆశపడ్డాడు. కొత్త పెళ్ళి కూతురు సంతోషాన్ని పాడుచేయకూడదని చాలా జాగ్రత్త వహించాడు.

మొదట్లో భార్యకి పుట్టిన ముగ్గురు పిల్లల్ని చెల్లెలు ఇంటి దగ్గర దిగబెట్టాడు. ఆమెను సంతోషపెట్టి తన వశం చేసుకోవాలని విశ్వ ప్రయత్నం చేస్తున్నాడు. కొంత మంది పెద్దలు చెప్పినట్లు అన్ని దర్గాల చుట్టు ప్రదక్షిణలు చేయించాడు. లెక్కకు మించి వైద్యుల వద్ద రకరకాల మందులు, తాయెత్తులు ఇప్పించాడు. చాలా మంది ముసలమ్మలతో ఆమె చెవుల్లో మంత్ర వృష్టి కురిపింపచేశాడు. కొత్తరకం బట్టలు, సరికొత్త సినిమాలు ఎన్నో మరెన్నో అయినా ఫలితం మొద ముఖం పెడముఖంగానే వుంది.

మిఠాయిపొట్లం, మల్లెపూలు మంచంమీద పెట్టాడు. పరిష్కారం అంతుబట్టక ఆలోచనల్లో మునిగిపోయాడు. షహనాజ్ చాయ్ తెచ్చింది.

అందుకుంటూ...''ఎందుకట్లున్నావు. ఆరోగ్యం బావు లేదా!'' చికాకుగా అడిగాడు.

''ఇంతకు ముందే మా అన్నయ్య వచ్చి పోయినాడు'' అబ్దుల్లా ఆశ్చర్యపడ్డాడు. ''మీ అన్నయ్య వచ్చాడా! నిజమా!'' అంటూ సగం చాయ్ సాసర్లో పోసి ఆమె కందించాడు. ఆమె తల అడ్డంగా తిప్పుతూ అక్కడి నుంచి పోబోయింది.

''మరి నేనొచ్చిందాకా వుండమని చెప్ప కూడదూ!''

''చెపుదామనుకున్నాను. కానీ మధ్యలో, మా అమ్మ మాట''... ఒక్కసారి దుఃఖం ముంచెత్తింది ఆమెను. ఏడుపు మాటలన్నీ పెగల నివ్వలేదు. కొద్ది సేపయ్యాక బియ్యం చేటెత్తుకుని లోపలకికి వెళ్లి పోయింది. అబ్దుల్లా అడ్డగోడకు వీపు ఆనించి మంచం మీద కూర్చున్నాడు. చీకటి నిండుకున్న భవిష్యత్తులో మార్గం కోసం ఆలోచిస్తున్నాడు!

* * * *

పగలు పది గంటల పొద్దెక్కినా పళ్లు కూడా తోముకోలేదు షహనాజ్. రోజులు గడిచే కొద్ది బ్రతుకు మీద రోత పెరిగిపోతోంది. తన సంసార జీవితాన్ని గూర్చి పేర్చు కున్న కలలన్నీ పేక మేడ లైనాయి. అబ్దుల్లా చాలా మంచివాడు!

కానీ, అతనిపట్ల మనసులో చెలరేగిన అసంతృప్తి వదిలిపెట్టడం లేదు.

ఎంత సన్నిహితం కావాలన్నా సాసగనీడం లేదు. హృదయంలో ఏదో కొరత వెనక్కు ఈడుస్తూనే వుంది. పాపం రాత్రి తనతో కలసి భోం చేయమని బలవంతపెట్టాడు. చాలా సేపు బతిమాలు కున్నాడు. నువ్వు తినకుంటే నాకూ వద్దని భీష్మిం చాడు. ఏం చెప్పినా తాను సరే అన్లేకపోయింది. అతను కూడా వస్తుపడుకోక తప్పలేదు.

బాగా పొద్దుపోయిన తర్వాత చాప మీదున్న తన్ను మంచం మీదకి రమ్మన్నాడు. రెండు మూడు సార్లు పైట చెరగులాగాడు. కానీ తాను అతీ గతీ చెప్పలేదు. ఏమనుకున్నాడో ఏమో తర్వాత తన జోలికి రాలేదు. మమతలు గుబాళించనిదే మనుషులు దగ్గర కావడంతో తృప్తి లేదనుకుంది. అది ఆమె మనస్తత్వం!

తెల్లవారి తనకు మెలకువ రాకముందే లేచి వెళ్లి పోయాడు అబ్దుల్లా. బహుశా అలిగి వుంటాడు. అయినా ఇదేమీ కొత్తకాదు. నాలుగు మాసాలుగా నిత్యం జరుగుతున్న తతంగమే! అయితే ఈ దినం తన మీద అమ్మకు కంప్లయింట్ చేశాడు. పొద్దున్నే వచ్చి ఆమె చిర్రుబుర్రులాడి పోయింది. నీ ప్రవర్తన మార్చుకోకుంటే తలాక్ (విడాకులు) ఇస్తానన్నాడని బాధపడింది. ఆ మాట వింటే మనసు బెదిరి పోతుంది షహనాజ్‌కు. పాడులోకం తోటివారి బాధల్ని గూర్చి ఏ కొంచెమూ పట్టించుకోదు. తన సుఖం కోసం ఇతరుల్ని ఏమైనా చేస్తుంది. నిజం తెలుసుకోకుండానే నిందలు, అభాండాలు కుమ్మరి స్తుంది. తన అయిష్టతకు కారణం చెప్పమని చాలా సేపు నిలదీసింది అమ్మ. ఏం చెప్పాలి. చెబితే తన బాధలు ఎవరు తీరుస్తారు!

* * * *

మధ్యాహ్నం మూడు గంటలుదాటినా భోజనానికి రాలేదుఅబ్దుల్లా. ఈ దఫా గట్టిగా కోపగించుకున్నాడను కుంది షహనాజ్. ఇంకెప్పుడూ ఇంటికి రాడేమో!ఆ మాటనుకున్నప్పుడు మనసు కళవళపడింది. ఆత్రుత



గొర్తి గుమ్మంలో నిల్చుని అతని కోసం చాలాసార్లు ఎదురు చూసింది. కూరగాయలు మాత్రం పక్కింటి అబ్బాయితో పొద్దున్నే పంపించాడు. పనుంటే మధ్యాహ్నం రానని ముందే చెప్పేవాడు. మరెందుకు రాలేదు. ఇప్పుడేం చేయాలి? ఏమీ పాలుపోలేదామెకు. ఇంతకు ముందు ఎన్నోసార్లు ఇట్లాగే అయింది. కానీ ఇంతగా మనసు ఎప్పుడూ ఆరాటపడలేదు.

"షహనాజ్ తాతయ్యకు కాళ్ళుకడుక్కోడానికి నీళ్ళివ్వు!?"

ఉలిక్కిపడింది షహనాజ్. అబ్దుల్లాతోపాటు దావూద్ తాతయ్య కూడా నిల్చుని వున్నాడు.

వెంటనే "అస్సలాము - అలైకుమ్" అంది.

"వాలేకుమ్ సలామ్" అంటూ తాతయ్య ముసి ముసిగా నవ్వాడు. తాతయ్యను చూసి మనసు గతుక్కుమంది. తలాక్ విషయం మాట్లాడేందుకు వచ్చినాడేమోనని చికాకుపడింది. దావూద్ తాతయ్యంటే ఆ వూర్లో పెద్ద గౌరవం. వయసు డెబ్భై పైబడి వుంటుంది. రెండు సార్లు హజ్ యాత్ర చేశాడు. ముస్లింల మతపరమైన సమస్యలన్నీ చాలా వరకు అయనే పరిష్కరిస్తుంటాడు.

భోజనానంతరం తాంబూలం వేసుకుంటూ

### చెడిపోయారు

చిన్ననాటి మిత్రులు చాలా కాలం తర్వాత కలుసుకున్నారు.

"చాలా కాలం తర్వాత కలిశావు, నీ కుమారులేం చేస్తున్నారు?" ని రెండవ వ్యక్తిని అడిగాడు మొదటి వ్యక్తి.

"మొదటివాడు చిత్రకారుడు, రెండోవాడు కవి, మూడోవాడు కూడా అదే దారిలో చెడిపోయే దశలో వున్నాడు" అన్నాడు విచారంగా.

—రమ (హైదరాబాద్)

నింపాదిగా కూర్చున్నాడు తాతయ్య. ముఖ్యమైన విషయాలు మాట్లాడాలి తన్ను కూడా త్వరగా భోం చేయమన్నాడు. భయం భయంగా నాల్గు మెతుకులు మింగింది. తాతయ్య మంచం వద్ద చాప వేసుకుని వినయంగా కూర్చుంది. అబ్దుల్లా కూడా తలకు కర్చీఫు కట్టుకుని తాత పక్కన కూర్చున్నాడు. తాత ఏం చెపుతాడోనని చెవులు రిక్కించి పెట్టింది షహనాజ్.

"మాడమ్మాయి ఇంతకు మునుపే నీకు అన్ని విషయాలు చెప్పాను. ఇక మీదట బుద్ధిగా మసులుకుంటానని ఆ రోజు మాటిచ్చావు. కానీ, ముందుకంటే మరీ మంకుతనం పెరిగిపోయిందని బాధపడుతున్నాడు అబ్దుల్లా. ఇప్పుడు నేనడిగే వాటికి మనసులో ఏదీ దాచుకోకుండా చెప్పు. నీకు ఇష్టమైనట్లే నిర్ణయం తీసుకుంటాను" క్షణం సేపు తాతయ్య కళ్ళలో చూసి సరే అన్నట్టు తలూపింది షహనాజ్.

"ఇల్లడుగుతున్నందుకు మరోలా అనుకోకు. పెళ్ళికి ముందు నీవు ఎవరినన్నా ప్రేమించి వుంటే నిర్భయంగా చెప్పు. నీతో ఖులా (భార్య, భర్తకు విడాకులిచ్చు సంప్రదాయం) ఇప్పించి అతనితోనే వివాహం జరిగేట్లు చూస్తాను" షహనాజ్‌కు తల తిరిగిపోయింది. తాతయ్య అట్లంటాడని ఆమె ఊహించలేదు. కోపంగా తాతయ్య వైపు చూసింది.

"ఫర్వాలేదు చెప్పు బేటీ. ఏం భయపడకు అన్నిటికి అల్లా వున్నాడు" అంటూ ధైర్యం చెప్పాడు తాతయ్య.

"నానాజీ" బాధగా అరిచింది ఆమె. ఆవేశంతో వుక్కిరి బిక్కిరియై బుసలుకొట్టోంది. ఆమె చేతుల్లో వున్న జీవిత భాండాన్ని ఏం చేస్తుందోనని వుత్కంఠతో చూస్తున్నాడు అబ్దుల్లా. నిదానంగా బాధనూ, ఆవేశాన్ని దిగమింగింది షహనాజ్.

"నాకు తెలుసు తాతయ్యా! ఇప్పుడు మీరన్న


ఇంటిల్లిపాదికీ
ఉపయోగకరం
ధర స్వల్పం!

ప్రాచీనకాలం నుంచి గుణకారకమైనదని నిరూపించబడిన నల్లతుమ్మలోని నైసర్గిక తత్వములతో కూడిన ఏకైక టూత్‌పేస్టు బబూల్ చిగుళ్లకు ఆరోగ్యం, పళ్లకు దృఢత్వం, శ్వాసకు తాజాదనం చేకూర్చుతుంది.




BALSARA
టూత్‌పేస్ట్ విశేషజ్ఞులు

CHAITRA-B BLS 926 TEL

మాటలు కొత్తవేమీ కావు. పెళ్ళయిన పది రోజులకే అనేసింది అబ్దుల్లా చెల్లెలు. తన అభిప్రాయాన్ని తప్పకుండా అన్నయ్యకు కూడా చెప్పి వుంటుంది. ఏం చేయను తాతయ్యా. నేను దురదృష్టవంతురాల్ని" బాధగా శూన్యం లోకి చూసింది.

"బాధపడకు బేటీ, అన్నీ అల్లా చూసుకుంటాడు" ఓదార్పుగా అన్నాడు తాతయ్య.

"ఇంతకు వచ్చి వూరుకోవడం మంచిది కాదు చెపుతాను తాతయ్య" అంది. తాతయ్య, అబ్దుల్లా చెవులప్పగించి వింటున్నారు. "నేను మూడు మాసాల పసిపిల్లగా వున్నప్పటి మాట. అమ్మ శీలాన్ని శంకించి తలాక్ చెప్పారట నాన్న. ఇద్దత్ డబ్బు మూడు (భార్యను వదిలిన భర్త భరణం) వందల పాతిక చెల్లించి చేతులు దులుపుకున్నారు. నిర్దాక్షిణ్యంగా బయటకి గెంటివేశారు. పది సంవత్సరాల అన్నయ్యను అక్కడే వదిలేసింది అమ్మ. నన్ను తీసుకుని తన సొంత వూరు చేరిందట. కొంత కాలం తిండి తిప్పలూ గడిపాడు మామయ్య.

ఆయన పేదవాడట. ఎంత కాలం భరించుకో గలడు. తప్పదని ఆయన సహించుకున్నా ఆయన భార్య వొప్పుకోలేదు. బంగారంవంటి భర్తకు ద్రోహం చేసింది మా ఆడ కూతురనింది. అమ్మలక్కలంతా చెవులు కొరుక్కున్నారు. మా కొంప మీద పడి మమ్మల్ని బాధిస్తుందని ఒకటే గొడవ చేసేదట. కష్టాల కడగళ్ళు మోస్తూ అట్లే కొంత కాలం గడిపింది. వాళ్ళ గొడవలతో విసిగిపోయాడు మామయ్య. చెల్లెలు కేవేవో నూరిపోశాడు.

ఒక రోజు నమ్మించి ఆమెను బొంబాయికి తీసుకుపోయాడు. అక్కడొక దారిన పోయే దానయ్య కప్పగించి తన పీడ విరగడ చేసుకున్నాడు. ఆ రోజు నుంచి మగవాళ్ళ దగా-దౌర్జన్యం ఆమెను క్రూరంగా వెంటాడాయి. మల్లెపువ్వు మాదిరి నలిపివేశారు. విధిలేక ఒకటీ... రెండూ... మూడు చేతులు మారవల్సివచ్చింది. నాకు పది సంవత్సరాల వయసప్పుడు ఇప్పుడున్న తన్నే తీసుకుని ఈ వూరొచ్చింది. మా అన్నయ్య నన్ను తీసుకెళ్ళాలని వచ్చినాడు. నాకు వూహ తెలిసినప్పటి నుంచి మా నాన్నను చూడలేదు. మధ్యలో రమ్మంటే తల్లిని వదలిపెట్టి పోలేక పోయాను.

కొంతకాలం తరువాత బతకలేక తిరిగి బొంబాయి వెళ్ళిపోయాము. సంవత్సరం క్రితం వరకు అక్కడే వున్నాము. ఒకరోజు మేమున్న ప్రాంతంలోని గుడిశెలన్నీ కూల్చివేశారు కార్పొరేషన్ వాళ్ళు. నన్ను బొంబాయిలో పెండ్లి చేసివ్వడం అమ్మకిష్టం లేదు. ఆ సాకుతో మమ్మల్ని తీసుకుని మళ్ళీ ఈ వూరొచ్చింది. వాళ్ళు రెక్కలుముక్కలు చేసుకుంటే గాని నా పెళ్ళి కాలేదు. ఇంత వరకు కన్న తండ్రిని చూసె భాగ్యానికి నోచుకోలేదు నేను. కన్న తల్లి ముఖం చూడనంటే చూడనంటున్నాడు అన్నయ్య. తల్లి వంటిదే కూతురని నెత్తిన నోరెట్టుకుంది ఈ పాడు లోకం. తల్లిపాలు వదులుకున్న తరువాత కన్న తండ్రి తన బిడ్డను తీసుకుపోవాలంటుంది మన ధర్మం. ఆ పని మా నాన్న చేసివుంటే ఈ రోజు నేను కోటీశ్వరుల అమ్మాయిని. కోరినంత బంగారం ఇచ్చి నన్ను అందల మెక్కించేవారు. ఒక్క స్త్రీ ఎన్ని నిక్కాలైన చేసుకోవచ్చునంటుంది మన సంప్రదాయం. కానీ, ఈ సంప్రదాయవాదులే నన్ను కులట కూతుర్ని చేసి ఆడిపోసుకుంటున్నారు.

ఇప్పుడు చెప్పండి నానాజీ. పెద్దలుచేసిన తప్పులకు నా జీవితం బలికాలేదా! బాధ హృదయాన్ని దహించి వేస్తున్నా నేను అబ్దుల్లాకు సుఖాన్ని ఇవ్వాల్సిందేనా! హృదయం లేని బొమ్మగా ఆయన కోర్కెలు తీర్చడమేనా నా పని. ఆ పని చేయకుంటే నాకాయన తలాక్ ఇస్తాడా! ఇది మీకు ధర్మమని తోస్తే నాక్కూడా తలాక్ ఇప్పించండి నానాజీ!

హృదయం పగిలి దుఃఖం పొంగువారింది షహనాజ్ కు. భరించుకోలేక తాతయ్య కాళ్ళ మీద పడి భోరున ఏడ్చింది. తాతయ్య కళ్ళుచెమ్మగిల్లాయి. ఆమె బాధల గాథ విని తలాడిస్తూ వీపు నిమురుతున్నాడు. ఇదంతా విని నిశ్చేష్టుడయ్యాడు అబ్దుల్లా.

"మన ప్రవక్త తలాక్ ఇవ్వడం మంచిపని కాదన్నాడమ్మా. స్వార్థాలకు, స్వప్రయోజనాలకు దాన్ని వుపయోగించ కూడదని ఆయన అభిమతం. బలమైన కారణాలువుంటే తప్ప తలాక్ జోలికి పోకూడదమ్మా. ధర్మాలు ఆచరించే ప్రతి ఒక్కరూ బాధ్యతలు కూడా విస్మరించరాదు" అణుకువతో చెప్పాడు తాతయ్య.

అబ్దుల్లా మెల్లగా లేచి షహనాజ్ భుజాలు పట్టుకుని తాతయ్య పాదాల మీద నుంచి లేపాడు.

"ఈ పట్నంలో మీరందరూ దాతగా ఆకాశానికెత్తిన షావుకార్ మదీనాఖాన్ మా తండ్రి" అంది ఆమె మెల్లగా!

ఆ... అంటూ దిగ్భ్రాంతి చెందారు వాళ్ళిద్దరూ!

తన బాధంతా వాళ్ళకు చెప్పడంతో మనసు కొంచెం తేలికపడిందామెకు.

కొంచెంసేపు నిశ్శబ్దం నిండుకుంది!

"తప్పకుండా మీ తండ్రిని ఇక్కడికి తెస్తానమ్మా! నా మాట నమ్ము" భరోసా ఇచ్చాడు తాతయ్య.

"నన్ను క్షమించు షహనాజ్ ఇంకెప్పుడూ నీ మనసు నొప్పించను. గతాన్ని పీడకల వలె మర్చిపో. అల్లా సాక్షిగా నువ్వు నా సర్వస్వం" అంటూ ఆమె చెయ్యి పట్టుకున్నాడు అబ్దుల్లా.

ఒకర్నొకరు గాఢంగా చూసుకున్నారు. ఆనందంతో ఇద్దరి ముఖాలు వికసించాయి.

సంతోషంతో ఉ గిపోతూ "అమీన్... అమీన్ (తథాస్తూ) అన్నాడు దావూద్ తాతయ్య.

◆



## గిన్నెస్ బుక్‌లో కవలలు

ఆమెకు ఎడమవైపు నిలబడిన మార్క్ ఎత్తు 6 అడుగుల 9 అంగుళాలు కాగా, కుడివైపు వున్న జోనాథన్ ఎత్తు తన సోదరుని కంటే ఒకంగుళం తక్కువ. అలా వీరిద్దరూ బ్రిటన్‌కి చెందిన అతి పొడవైన కవల సోదరులుగా గిన్నెస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు చేసుకున్నారు.

—డి. హెచ్.

## ఇంకేం మాట్లాడాలి

"నన్ను పెళ్ళి చేసుకుంటావా? చెప్పు రాణి" ఓ యువకుడు తన ప్రేయసి నడిగాడు. ఆ యువతి సిగ్గుపడుతూ తల ఊపింది. దాంతో ఆ యువకుడు విచారంగా ముఖం పెట్టి దీర్ఘాలోచనలో మునిగిపోయాడు.

"అలా [illegible]న్నావేం? ఏదైనా మాట్లాడు!"

"ఇంకా మాట్లాడడాని కేముంది?" విచారంగా అన్నాడా యువకుడు.

—రమ (హైదరాబాద్)

